తెలంగాణ
వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :56 10-09- 2026 గురువారం పేజీలు: 4 వెల:03/-

# సభాపతిని అవమానించిన వారిని వదిలిపెట్టం

**-కుట్రపూరిత ఘటనలపై సమగ్ర విచారణ..**
**-దోషులపై క్రిమినల్ కేసులు**
**-శాసనసభలో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి**



హైదరాబాద్, సెప్టెంబర్ 9:
శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజు సెప్టెంబర్ 6న చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దోషులను చట్టపరంగా శిక్షించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శాసనసభలో వెల్లడించారు. సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి దుర్భాషలాడిన ఘటనతో పాటు, దళితులు నడిచిన నేలను శుద్ధి చేసిన ఘటనలపై సభలో తీవ్ర ఆందోళన వ్యక్తమైందని తెలిపారు.
సభాపతిని అవమానించేలా వ్యవహరించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జరిగిన ఘటనతో సభాపతి మనసుకు గాయం అయిందని, ఈ విషయంలో ప్రభుత్వం ఆయనకు పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు.
తల్లిని అవమానించడం దారుణం
సభాపతి తల్లిని సైతం అవమానించేలా కొందరు వ్యవహరించడం అత్యంత దారుణమని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్మాదానికి లోనై, కొందరి ప్రేరేపణతో అధికారులు, సభాపతిపై అవమానకరంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇది ముందస్తు ప్రణాళికతో జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. స్త్రీని గౌరవించే సంప్రదాయం తెలంగాణ సమాజానిదని పేర్కొన్న ముఖ్యమంత్రి.. మహిళను అపరకాళి, భద్రకాళి, భూమాత, భారతమాత, తెలంగాణ తల్లిగా గౌరవించే సమాజంలో ఒక తల్లిని అవమానించేలా వ్యవహరించడం బాధాకరమన్నారు.
ప్రజాస్వామ్యంలో నిరసనలకు ఎన్నో మార్గాలు
ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడానికి అనేక మార్గాలు ఉన్నాయని, అయితే సభాపతిని అవమానించేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని ముఖ్యమంత్రి అన్నారు. సభాపతికి జరిగిన అవమానం మొత్తం సమాజానికి జరిగిన అవమానంగా తెలంగాణ ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. దోషులను తెలంగాణ సమాజం ఉపేక్షించదని స్పష్టం చేశారు.
ప్రజా సమస్యలపై చర్చకు అడ్డంకులు
సెప్టెంబర్ 7 నుంచి శాసనసభలో ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాలని ప్రభుత్వం భావించిందని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యారంగ సమస్యలు, ధరణిలో జరిగిన అక్రమాలు, 22(ఎ) అంశం సహా ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అయితే ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభా కార్యక్రమాలకు అడ్డంకులు కలిగించారని ఆరోపించారు.
సభా గౌరవాన్ని కాపాడటంతో పాటు ప్రజా సమస్యలపై చర్చకు ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# పెళ్లి బంధమే.. స్వేచ్ఛకు సంకెళ్లు కాదు!

**సమ్మతి లేకుండా లైంగిక చర్యపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**
**వైవాహిక అత్యాచార మినహాయింపుపై తుది తీర్పుకు ముందు కొనసాగుతున్న విచారణ**




న్యూఢిల్లీ బ్యూరో:
వివాహం అయినంత మాత్రాన మహిళ తన వ్యక్తిగత స్వేచ్ఛను, శారీరక స్వయంప్రతిపత్తిని, నిర్ణయాధికారాన్ని కోల్పోదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వైవాహిక అత్యాచారానికి సంబంధించిన చట్టపరమైన మినహాయింపును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ అంశంపై దృష్టి సారించింది. అయితే ఈ వ్యవహారంలో ఇప్పటివరకు తుది తీర్పు వెలువడలేదు.వివాహ బంధం కారణంగా మహిళ తన శరీరంపై నిర్ణయం తీసుకునే హక్కును కోల్పోయినట్లు భావించలేమని పిటిషనర్లు వాదిస్తున్నారు. భార్య సమ్మతి లేకుండా భర్త లైంగిక చర్యకు పాల్పడితే దానికి చట్టపరమైన రక్షణ కల్పించడం మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవానికి విరుద్ధమని వారు పేర్కొంటున్నారు.
పెళ్లితో సమ్మతి ముగియదు
వివాహం అనేది ఇద్దరి మధ్య ఏర్పడే బంధమే తప్ప.. మహిళ తన శారీరక స్వేచ్ఛను, వ్యక్తిగత నిర్ణయాధికారాన్ని శాశ్వతంగా వదులుకున్నట్లు కాదని పిటిషనర్లు స్పష్టం చేస్తున్నారు. వైవాహిక జీవితంలోనూ భార్య సమ్మతికి ప్రాధాన్యం ఉండాలని వారు కోరుతున్నారు.
ఈ అంశంపై సుప్రీంకోర్టు కూడా మహిళ వ్యక్తిగత స్వేచ్ఛ, స్వయంప్రతిపత్తికి సంబంధించిన ప్రశ్నలను పరిగణనలోకి తీసుకుంటోంది. దీంతో ఈ విచారణ దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

2

# చేయాల్సిన అవమానాలన్నీ చేశారు:

## పసుపు నీళ్లతో శుద్ధి ఘటనపై భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్ బ్యూరో
సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఊరిలో ఇటీవల చోటుచేసుకున్న పసుపు నీళ్ల శుద్ధీకరణ పరిణామంపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అత్యంత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతాయుత పదవుల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు పర్యటించిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లు, పాలతో కడిగి శుద్ధీకరణ పేరుతో నిరసన తెలపడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా బీఆర్ఎస్ నేతలు తమపై చేయాల్సిన అవమానాలన్నీ చేశారని, వారి ప్రవర్తన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేసిన ప్రజాప్రతినిధులు ఒక ప్రాంతానికి వెళ్లి వస్తే, ఆ ప్రదేశం అపవిత్రమైపోయిందని భావిస్తూ కడిగి శుభ్రం చేయడం బీఆర్ఎస్ నేతల రాచరిక ఆలోచనలకు, అహంకార ధోరణికి స్పష్టమైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి విమర్శించారు. అధికారం కోల్పోయినా ఆ పార్టీ నాయకులకు ఇంకా దొరతనం పోలేదని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను ఈ విధంగా అవమానించడం వారి దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందని దుయ్యబట్టారు. ఇటువంటి విపరీత ఆలోచనలు సమాజ పురోగతికి తీవ్ర నిరోధకంగా మారుతాయని హెచ్చరించారు.
సామాజిక వివక్ష మరియు దళిత వర్గాల అవమానం:
ముఖ్యంగా దళిత వర్గానికి చెందిన నాయకులు, ప్రతినిధులు నడిచిన నేలను పసుపు నీళ్లు, పాలతో కడిగి శుద్ధీకరణ చేయడం అనేది కేవలం వ్యక్తులపై చేసిన దాడి కాదని, అది పూర్వకాలపు అస్పృశ్యత, సామాజిక వివక్షత భావాలను మళ్లీ సమాజంలోకి తీసుకువచ్చే కుట్ర అని భట్టి విక్రమార్క ఆరోపించారు. సమాజంలో సమానత్వం, సోదరభావం పెంపొందించాల్సిన ప్రతిపక్ష నాయకులు, ఈ రకమైన అసమానతలను ప్రోత్సహించే చర్యలకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఇది మొత్తం దళిత, బలహీన వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీయడమేనని స్పష్టం చేశారు. సమాజంలో సఖ్యతను నాశనం చేసే ఇటువంటి దుశ్చర్యలను ఏమాత్రం సహించేది లేదని తేల్చిచెప్పారు.
భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా సంచరించే, ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు తెలిపే హక్కును కల్పించిందని ఆయన గుర్తుచేశారు. అయితే రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకున్న

2

# లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన మంత్రులు:

## బీఆర్ఎస్ నాయకుల శుద్ధీకరణ చర్యలపై ఫిర్యాదు



హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉద్రిక్తత, హాట్ టాపిక్‌గా మారిన ఘటనల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన పలువురు కీలక మంత్రుల బృందం లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఎర్రవల్లి ప్రాంతంలో ఇటీవల ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు చేపట్టిన "శుద్ధీకరణ" కార్యక్రమాలు, రాజకీయ వేధింపుల విధానం మరియు ప్రతిపక్ష నేతల తీరుపై మంత్రులు గవర్నర్‌కు అధికారికంగా ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజాస్వామ్య సూత్రాలను కాపాడాలని ఈ సందర్భంగా వారు గవర్నర్‌ను కోరారు.
ఇటీవల ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు దళిత వర్గాలకు చెందిన ప్రతినిధులు ఒక ముఖ్యమైన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే, కాంగ్రెస్ నాయకులు ఆ ప్రాంతం నుండి వెళ్ళిన వెంటనే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని, కాంగ్రెస్ నేతలు నడిచిన ప్రదేశాన్ని పాలతో మరియు పవిత్ర జలాలతో కడిగి "శుద్ధీకరణ" పేరుతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ "శుద్ధీకరణ" చర్య రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారానికి దారితీసింది. కాంగ్రెస్ పార్టీ దీనిపై తీవ్ర స్థాయిలో మండిపడింది. దళిత నాయకులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తిరిగిన ప్రాంతాన్ని కడిగి శుభ్రం చేయడం అనేది నేరుగా దళితులను, వెనుకబడిన వర్గాలను అవమానించడమేనని ఆరోపించింది.
ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కాంగ్రెస్ మంత్రుల బృందం లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో సమావేశమైంది. ఈ భేటీలో బీఆర్ఎస్ నాయకుల వైఖరిపై పలు కీలక అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు:
రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన: ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంటాయని, అయితే ఒక వర్గం లేదా పార్టీ నేతలు తిరిగిన ప్రదేశాన్ని శుద్ధీకరణ చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రులు పేర్కొన్నారు.
?సామాజిక రుగ్మతల పునరావృతం: పూర్వకాలపు అస్పృశ్యత, వివక్ష భావాలను గుర్తుచేసేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని, ఇది సమాజంలో తప్పుడు

2

# జిల్లా వ్యాప్తంగా డీజేల హోరు..

## గాలికి ఎగిరిన నిబంధనలు!

- గ్రామాలు, పట్టణాల్లో చెవులు చిల్లులు పడేలా రణగొణ ధ్వనులు
- వినాయక చవితి వేళ 'టెస్టింగ్' పేరుతో ఇష్టారాజ్యం
- వృద్ధులు, గర్భిణులు, పసిపాపలు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు
- అనుమతులు లేకుంటే సీజ్ చేయాలని ప్రజల విజ్ఞప్తి



నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లా వ్యాప్తంగా డీజేల మోత మోగిపోతోంది. పట్టణాలు, మండల కేంద్రాల నుంచి మారుమూల గ్రామాల వరకు భారీ సౌండ్ సిస్టమ్‌లతో రణగొణ ధ్వనులు వినిపిస్తున్నాయి. రాబోయే వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో 'టెస్టింగ్' పేరుతో డీజేలను అధిక శబ్దంతో మోగిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా శబ్దాలు వినిపిస్తుండటంతో ప్రశాంత వాతావరణం కరువవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు అమలవుతున్నాయా?**

శబ్ద కాలుష్య నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం లౌడ్‌స్పీకర్లు, ప్రజా ప్రసార వ్యవస్థల వినియోగానికి పరిమితులు ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో బహిరంగ ప్రదేశాల్లో శబ్ద పరికరాల వినియోగంపై ఆంక్షలు ఉన్నాయి. ఆసుపత్రులు, విద్యాసంస్థలు వంటి ప్రాంతాల్లో మరింత కఠినమైన శబ్ద పరిమితులు వర్తిస్తాయి. అయితే జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఈ నిబంధనలు అమలవుతున్న తీరు ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు**

భారీ డీజేల శబ్దంతో వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గర్భిణులు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో నిద్రకు ఆటంకం కలుగుతోందని, విద్యార్థులు చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారని వాపోతున్నారు. భారీ సౌండ్ సిస్టమ్‌ల నుంచి వచ్చే కంపనాలతో ఇళ్ల తలుపులు, అద్దాలు సైతం కంపిస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి**

అనుమతులు లేకుండా లేదా నిర్ణీత పరిమితులకు మించి డీజేలు నిర్వహిస్తున్న వారిపై అధికారులు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా డీజే నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులకు నిబంధనలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇవ్వాలని, అయినా నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు పోలీసులు, జిల్లా యంత్రాంగం ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## రబింద్ర పాఠశాలలో ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి



ముధోల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ ఉద్యమ గళం, ప్రజాకవి కాళోజీ నారాయణరావు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ముధోల్ రబింద్ర ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్ అన్నారు. బుధవారం పాఠశాలలో కాళోజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమసమాజ నిర్మాణం కోసం కాళోజీ తన సాహిత్యం, ఉద్యమాల ద్వారా నిరంతరం పరితపించారని కొనియాడారు. ఆయన పుట్టినరోజును తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం యావత్ తెలంగాణకు గర్వకారణమన్నారు. విద్యార్థులు కాళోజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ చైతన్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు సంధ్య, ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రైనర్ వర్క్‌షాప్‌లో శ్రీరామ్ గణేష్‌కు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు"



దిలావర్‌పూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్-19 ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్ 2.0 (టిటో) శిక్షణలో దిలావర్‌పూర్‌కు చెందిన శ్రీరామ్ గణేష్ ప్రతిభ కనబరిచి "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు"ను కైవసం చేసుకున్నారు. నిర్మల్‌లో నిర్వహించిన ఈ శిక్షణలో అసెస్‌మెంట్, మూల్యాంకన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఆయనకు ప్రొవిజనల్ ట్రైనర్‌గా గుర్తింపు కార్డుతో పాటు అవార్డును అందజేశారు. లేబర్ కమిషనర్ ముత్యంరెడ్డి, రీజియన్ అధ్యక్షులు వాడేకర్ లక్ష్మణ్, హెడ్ కోచ్ ఉదయభాస్కర్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. యువతలో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేస్తానని గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్లు శ్యామ్ రాథోడ్, రామచంద్రుడు, మాధవి పాల్గొన్నారు.

## తరోడాలో కొండముచ్చుకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించిన బజరంగ్ దళ్



ముధోల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల పరిధిలోని తరోడా గ్రామ శివారులో రోడ్డు ప్రమాదవశాత్తు మృతి చెందిన కొండముచ్చు (కొండెంగ)కు బజరంగ్ దళ్ యువకులు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో అంత్యక్రియలు నిర్వహించారు. సనాతన హిందూ సంప్రదాయంలో కొండముచ్చును హనుమంతుని స్వరూపంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన మూగజీవి కళేబరానికి పూజలు నిర్వహించి, పూలమాలలు వేసి శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. మూగజీవి పట్ల అపారమైన జంతుప్రేమను, భక్తిని చాటుకున్న బజరంగ్ దళ్ సభ్యుల ఔదార్యాన్ని చూసి గ్రామస్తులు విశేషంగా ప్రశంసించారు. మూగజీవులను సంరక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని యువకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## కదిలి పాపారేశ్వర ఆలయంలో ముగిసిన శివపురాణ ప్రవచనాలు

### ఘనంగా సహస్ర లింగార్చన.. భక్తుల భజనలు, నృత్యాలు



దిలావర్‌పూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కదిలి మాతా అన్నపూర్ణ సమేత పాపారేశ్వర దేవాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న మహాశివపురాణ ప్రవచనాల ముగింపు వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. చివరి రోజు సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా సహస్ర లింగార్చన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల ప్రధాన దాతలు అల్లోల అపర్ణ ప్రశాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు పాపారేశ్వర స్వామికి, అన్నపూర్ణ మాతకు ప్రత్యేక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందాల శివనామస్మరణ గీతాల నడుమ మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో చేసిన నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వేలాది మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన దాత అల్లోల ప్రశాంత్ రెడ్డి దంపతులకు ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాజేష్, మాధవరావు పటేల్, కమిటీ చైర్మన్ వెంకట్రావు పటేల్, ధర్మకర్తలు సప్పల ప్రతిభారతి రవి, అనురాధ, దత్తురాం పటేల్, అల్లూరు రమేష్, భోజన్న, ప్రముఖులు తిరుపతి రెడ్డి, కోడె రాజేశ్వర్, అనిల్, రవి, కుంట సాయికృష్ణ, పూజారులు పంచాక్షరి పంతులు, శంకర్ పంతులు, సిద్దు పంతులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

ముధోల్ పాఠశాలల్లో ముధోల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):ప్రజాకవి,పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ముధోల్ మండల కేంద్రంలోని ప్రముఖ విద్యాసంస్థలైన రవీంద్ర, శ్రీ అక్షర, లిటిల్ ఫ్లవర్, సంకల్ప వ్యాలీ, శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలతో పాటు ఎడ్‌బిడ్ గ్రామంలోని ఫ్యూచర్ పాఠశాలలో తెలంగాణ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . పాఠశాలల్లో కాళోజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని చాటే పద్యాలు, కాళోజీ గేయాలు, సాంస్కృతిక గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చించాలలో ఉచిత వైద్య శిబిరం: వైద్యులకు ఘన సన్మానం



ముధోల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా ముధోల్ మండలంలోని చించాల గ్రామంలో స్థానిక సర్పంచ్ సర్వేష్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. నిపుణులైన వైద్యులు గ్రామస్తులకు జనరల్ ఓపీ పరీక్షలు, రక్తపోటు, మధుమేహం తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు తగిన ఆరోగ్య సలహాలు అందించారు. సీజనల్ వ్యాధులు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఉచిత వైద్య సేవలందించిన వైద్య బృందాన్ని సర్పంచ్ సర్వేష్, ఉపసర్పంచ్ సాయినాథ్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి మరిన్ని స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అవసరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సాయినాథ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రమ్య, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాసర పాపహరేశ్వర ఆలయంలో నెల రోజుల నిరంతర అన్నదానం విజయవంతం



బాసర, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర గోదావరి తీరంలోని శ్రీ పాపహరేశ్వర శివాలయ దేవాలయంలో పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరి ంచుకుని చేపట్టిన నిరం తర మహా అన్నదాన కార్యక్రమం బుధవారంతో దిగ్విజయంగా ముగిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా శ్రావణ మాసం ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా అన్నదానం నిర్వహించారు. స్థానిక చిట్టెపు వారి కుటుంబం మరియు లింగాయత్ సమాజం ప్రతిరోజూ పది మంది చొప్పున సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి లోటు రాకుండా అన్నప్రసాద వితరణను విజయవంతం చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త పంపట్‌వార్ లక్ష్మీకాంత్ సేట్ ముందుండి తన వంతు ఆర్థిక సహకారాన్ని అందించగా, ఆలయ అర్చకులు నాగేష్ అప్ప స్వామి నిస్వార్థంతో స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాసం పొడవునా ఆలయానికి విచ్చేసిన భక్తులకు భోజన సౌకర్యాలు కల్పించి సేవలు అందించిన దాతలు, నిర్వాహకులకు బాసర గ్రామ ప్రజలు, యువకులు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

# ఒక్క మాట జీవితాన్ని మార్చగలదా?

ఒక మనిషి జీవితంలో ఎన్నో సంఘటనలు జరుగుతాయి. కొన్ని సంవత్సరాల తర్వాత కూడా గుర్తుండిపోతాయి. కానీ వాటన్నింటికంటే కొన్నిసార్లు ఒక చిన్న మాట మాత్రం జీవితాంతం మనసులో నిలిచిపోతుంది. అది ప్రేమగా చెప్పిన మాట కావచ్చు.. ధైర్యం ఇచ్చిన మాట కావచ్చు.. లేదా మనసును గాయపరిచిన మాట కావచ్చు. మాట చిన్నదే.. కానీ దాని ప్రభావం మాత్రం చాలా పెద్దది.

మనిషికి ప్రకృతి ఎన్నో వరాలు ఇచ్చింది. వాటిలో మాట ఒక అద్భుతమైన వరం. మనసులో ఉన్న భావాన్ని ఎదుటివారికి తెలియజేయడానికి మాటే ప్రధాన సాధనం. ఒకరిని బాధ పెట్టడానికి కూడా మాటే ఉపయోగపడుతుంది.. అదే ఒకరిని కష్టాల నుంచి బయటకు తీసుకు రావడానికి కూడా మాటే ఉపయోగపడుతుంది. అందుకే మన పెద్దలు "మాట మంచిదైతే మనిషి మంచివాడు" అనే భావనకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు.మన ఇంట్లోనే చూసుకుంటే.. చిన్నపిల్లాడు ఏదైనా పని చేసినప్పుడు తల్లిదండ్రులు చెప్పే ఒక ప్రశంస అతనిలో ఎంతో ధైర్యాన్ని నింపుతుంది. అదే సమయంలో అందరి ముందు అవమానించే ఒక మాట అతని మనసులో చాలాకాలం మిగిలిపోవచ్చు. పెద్దవాడైన తర్వాత కూడా చిన్ననాటి మాటలు గుర్తుండపోవడానికి కారణం.. మాట చెవిలో పడినా దాని ముద్ర మనసులో పడటమే .అందుకే మాట్లాడే ముందు ఒక్కసారి ఆలోచించాలి. మనం చెప్పబోయే మాట నిజమేనా? అవసరమా? ఎదుటివారిని అనవసరంగా బాధపెడుతుందా? అనే మూడు ప్రశ్నలు మనల్ని మనం అడిగితే ఎన్నో సమస్యలను ముందే ఆపగలం. కోపంలో చెప్పిన మాటను తర్వాత ఎంత క్షమాపణ చెప్పినా.. ఆ మాట విన్న వ్యక్తి గుండెల్లో ఏర్పడిన గాయం వెంటనే మాయం కాదు.

ఇదే సమయంలో మంచి మాటకు ఉన్న శక్తిని కూడా మనం గుర్తించాలి. జీవితంలో ఓడిపోయానని భావిస్తున్న వ్యక్తికి "నువ్వు మళ్లీ ప్రయత్నించు.. నీ వల్ల అవుతుంది" అని చెప్పే ఒక మాట అతనికి కొత్త ధైర్యాన్ని ఇవ్వవచ్చు. బాధలో ఉన్న వ్యక్తిని "నేను నీతో ఉన్నాను" అని పలకరించే ఒక మాట అతని ఒంటరితనాన్ని తగ్గించవచ్చు. కొన్నిసార్లు మనం చేయలేని సహాయాన్ని కూడా ఒక మంచి మాట చేయగలదు.మన సంస్కృతిలో మాటకు ఇంతటి విలువ ఇవ్వడానికి ఇదే కారణం. పెద్దలను పలకరించడం, అతిథిని ఆప్యాయంగా పలకరించడం, ఎదుటివారిని గౌరవంగా సంబోధించడం వంటి సంప్రదాయాలన్నీ మనిషి మధ్య అనుబంధాన్ని పెంచేవే. మాటలో గౌరవం ఉంటే దూరంగా ఉన్న మనుషులు కూడా దగ్గరవుతారు. మాటలో అహంకారం ఉంటే దగ్గరగా ఉన్నవారు కూడా దూరమవుతారు.ఈ రోజుల్లో సాంకేతికత మన చేతిలోకి ప్రపంచాన్ని తీసుకొచ్చింది. ఫోన్‌లో ఒక సందేశం పంపడానికి క్షణం కూడా పట్టడం లేదు. కానీ మన పక్కనే ఉన్న మనిషితో మనస్ఫూర్తిగా నాలుగు మాటలు మాట్లాడటానికి మాత్రం సమయం దొరకడం లేదు. సందేశాలు పెరిగాయి.. సంభాషణ తగ్గింది. పరిచయాలు పెరిగాయి.. ఆప్యాయత తగ్గింది. ఇలాంటి సమయంలో ఒక మనసైన మాటకు విలువ మరింత పెరిగింది.అయితే మంచి మాట అంటే ఎప్పుడూ ఎదుటివారికి నచ్చిన మాట చెప్పడం కాదు. అవసరమైనప్పుడు తప్పును తప్పని చెప్పడం కూడా మంచితనమే. కానీ ఆ మాటలో అవమానం కాకుండా ఆప్యాయత ఉండాలి. విమర్శలో ద్వేషం కాకుండా మారాలని కోరుకునే మనసు ఉండాలి. నిజం చెప్పడం గొప్పది.. కానీ ఆ నిజాన్ని ఎలా చెప్పామన్నదే మన సంస్కారాన్ని తెలియజేస్తుంది.మనిషి తన సంపదను కోల్పోతే తిరిగి సంపాదించగలడు. పదవిని కోల్పోతే మరో అవకాశం రావచ్చు. కానీ ఒక మనిషి మనసును మాటతో గాయపరిస్తే.. ఆ నమ్మకాన్ని తిరిగి సంపాదించడం అంత సులభం కాదు. అందుకే మాటను తేలికగా తీసుకోకూడదు.ప్రతి రోజు మనం ఎంతో మందిని కలుస్తాం. అందులో ఎవరో ఒకరు మన మాట వల్ల బాధపడవచ్చు.. ఇంకెవరో మన మాట వల్ల ధైర్యం పొందవచ్చు. మనం ఏ ప్రభావాన్ని మిగిల్చి వెళుతున్నామన్నది మనమే నిర్ణయించుకోవాలి.

మనిషి చనిపోయిన తర్వాత అతని దగ్గర ఉన్న డబ్బును కాదు.. అతను ఎలా మాట్లాడేవాడో, ఎలా ప్రవర్తించేవాడో ఎక్కువగా గుర్తు చేసుకుంటారు. అందుకే మనం వదిలి వెళ్లాల్సింది ఆస్తి మాత్రమే కాదు.. మంచి జ్ఞాపకాలు కూడా. మన నోటినుంచి వచ్చే ప్రతి మాట ఒక విత్తనం లాంటిది. మంచి మాట అయితే ఒకరి జీవితంలో ఆశను మొలిపించవచ్చు.. చెడు మాట అయితే ఒకరి మనసులో బాధను పెంచవచ్చు. కాబట్టి మాట్లాడే ముందు ఆలోచిద్దాం.. మన మాటతో ఒక మనిషి మనసుకు గాయం చేయాలా.. లేక ఒక మనిషి జీవితానికి ధైర్యం ఇవ్వాలా అని.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## ఆశా వర్కర్ల వేతనం రూ. 18,000కు పెంచాలి:
## నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రాస్తారోకో



నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం వైద్య సేవలందిస్తున్న ఆశా వర్కర్ల గౌరవ వేతనాన్ని నెలకు రూ. 18,000కు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ ప్రజారోగ్య రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన 'చలో అసెంబ్లీ'కి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షురాలు సుగుణ, కార్యదర్శి లక్ష్మి, నాయకులు రామలక్ష్మి, భాగ్య, సంగీత పాల్గొన్నారు.

## ప్రజలకు నిరంతరం నాణ్యమైన వైద్య సేవలు అందించాలి:

సారంగాపూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): గ్రామీణ ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ రాజేందర్ ఆదేశించారు. బుధవారం సారంగాపూర్ మండలంలోని జామ్, కౌట్ల, మలక్ చించోలి, స్వర్ణ ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరును పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం మండలంలో నిర్మాణంలో ఉన్న నూతన ఆరోగ్య ఉప కేంద్ర భవనాలను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డెమో బారె రవీందర్, డీపీవో రామచందర్, సూపర్ వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.




# భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి
# సీనియర్ నేత ఎం.ఏ. లతీఫ్ వైపే మొగ్గు

ముధోల్/భైంసా, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): వచ్చే నెలలో ముగియనున్న భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గం నూతన చైర్మన్ ఎంపికపై ముధోల్ నియోజకవర్గంలో రాజకీయ చర్చ జోరందుకుంది. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజా సేవలో ముందుంటున్న సీనియర్ నాయకుడు ఎం.ఏ. లతీఫ్‌కు చైర్మన్ పదవి కేటాయించాలని నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు, రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. సాధారణ జీవనశైలితో అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగిన లతీఫ్‌కు బాధ్యతలు అప్పగిస్తే రైతు సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం కష్టకాలంలో నిలబడిన విధేయుడికి సముచిత గుర్తింపు ఇవ్వడం ద్వారా శ్రేణుల్లో ఉత్సాహం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఎం.ఏ. లతీఫ్ వైపే మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది.



## దళిత స్పీకర్‌ను అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను బహిష్కరించాలి:



ముధోల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అగౌరవపరిచేలా అసభ్య పదజాలంతో దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రావులను వారి పదవీకాలం ముగిసేవరకు శాసనమండలి నుంచి బహిష్కరించాలని ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి డిమాండ్ చేశారు. ముధోల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవికి మచ్చ తెచ్చేలా మాట్లాడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని మండిపడ్డారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి మాట్లాడిన తీరు యావత్ సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఈ అనుచిత ప్రవర్తన పట్ల దళిత సమాజంతో పాటు రాష్ట్ర ప్రజలంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు సదరు ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాధర్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, కిష్టన్న, చందురెడ్డి, సర్పంచ్ గంగశేఖర్, సాయినాథ్ పాల్గొన్నారు.

## ఔషధ మొక్క 'జ్యోతిస్మతి'పై పరిశోధనకు పవన్ కుమార్‌కు పీహెచ్‌డీ



నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 85వ కాన్వకేషన్ వేడుకల్లో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాటనీ (వృక్షశాస్త్ర) అధ్యాపకుడు ఎస్. పవన్ కుమార్ డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టాను అందుకున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ అభయారణ్య పరిధిలో లభించే అత్యంత అరుదైన, ప్రాముఖ్యత కలిగిన ఔషధ మొక్క "జ్యోతిస్మతి" (జవశ్రీఖరీతీబం జుఖఅఅఎబశ్రీఝబం) పై ఆయన విస్తృత పరిశోధనలు నిర్వహించి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఈ డాక్టరేట్ లభించింది. పవన్ కుమార్ ప్రతిష్టాత్మక పీహెచ్‌డీ పట్టా పొందడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం మరియు విద్యావేత్తలు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన చేసిన ఈ పరిశోధన ఆయుర్వేద, వృక్షశాస్త్ర రంగాల్లో మరింత సమాచారానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

## ధర్మారంలో ఇందిరమ్మ ఇళ్లకు ఘనంగా భూమిపూజ



లోకేశ్వరం, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):లోకేశ్వరం మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో అర్హులైన నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బుధవారం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మామిడి సంజీవరెడ్డి, ఉపసర్పంచ్ మంద గణేష్ ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలను జరిపించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లులు ఎప్పటికప్పుడు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలను పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల పరిధిలోని బన్సపల్లి గ్రామ పంచాయతీలో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ సోక్ పిట్స్ (ఇంకుడు గుంతలు)ను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శ్రీనివాస్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంకుడు గుంతల నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్రక్రియ వివరాలను సర్పంచ్ మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు ఎంతో దోహదపడతాయన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ ఇంకుడు గుంత, ప్రతి పొలంలో పంట కుంట, గ్రామాల్లో ఊట కుంటలు ఏర్పాటు చేసుకునేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజల్లో చైతన్యం తేవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, ఉపసర్పంచ్ పాల్గొన్నారు.



# ఆదివాసీల మనుగడపై పెత్తందారీ దాడి!

## 1/70 చట్టాన్ని సడలిస్తే భూహక్కులు శూన్యం!




ఏజెన్సీ గిరిజనుల తరతరాల మనుగడకు, ఆత్మగౌరవానికి, సాంస్కృతిక ఉనికికి రక్షణ కవచంగా నిలిచిన 1/70 చట్టాన్ని నీరుగార్చేందుకు అగ్రకులాలు, బడా కాంట్రాక్టర్లు, వ్యాపార శక్తులు పన్నుతున్న కుట్రలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. ఈ కుట్రదారుల్లో ప్రధానంగా భారతీయ కిసాన్ సంఘ్ కార్యదర్శి మంథనపు రామారావు ముందు వరుసలో నిలిచి గిరిజన వ్యతిరేక ప్రచారానికి ఒడిగట్టారు. ఇటీవల ఆయన వివిధ పత్రికా వేదికలుగా 1/70 చట్టానికి వ్యతిరేకంగా రాస్తున్న వ్యాసాలు కేవలం వ్యక్తిగత అభిప్రాయాలు ఎంతమాత్రం కావు. అవి ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల భూములను అక్రమంగా కొల్లగొట్టాలని ఏళ్లుగా ఆశగా చూస్తున్న అగ్రకుల పెత్తందారీ శక్తుల పక్కా వ్యూహానికి, కుట్రలకు అద్దం పడుతున్నాయి. 'ఆర్థిక స్వేచ్ఛ', 'భూమికి సరైన మార్కెట్ విలువ', 'పారిశ్రామిక అభివృద్ధి' అనే రంగురంగుల ముసుగులు తొడిగి, గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కులను బలిపీఠం ఎక్కించేందుకు కుట్రదారుడైన మంథనపు రామారావు పన్నుతున్న వ్యూహాలు తీవ్రంగా ఖండించదగినవి .భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ద్వారా లభించిన హక్కులను కాలరాస్తూ, ఆదివాసీలను తమ సొంత నేలపైనే శరణార్థులుగా మార్చాలనే ఆలోచన వెనుక బడా వ్యాపారుల ప్రయోజనాలు దాగి ఉన్నాయి. చారిత్రకంగా చూస్తే, గిరిజన ప్రాంతాలు, అక్కడి అడవులు, కొండలు, ఏరులు అన్నీ ఆదివాసీల సొత్తు. కానీ మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన దళారులు, అగ్రకుల భూస్వాములు అమాయకులైన గిరిజనులకు అప్పులిచ్చి, మద్యం అలవాటు చేసి, మోసపూరిత ఒప్పందాలు మరియు దొంగ రిజిస్ట్రేషన్లతో వారి భూములను లాక్కున్న నల్లటి చరిత్ర మన కళ్ల ముందు ఉంది. గిరిజనులను వారి సొంత భూముల నుంచే తరిమేసిన ఈ దోపిడీ వ్యవస్థను అరికట్టడానికే 1/70 చట్టం పుట్టుకొచ్చింది. ఏజెన్సీ పరిధిలోని భూమి గిరిజనుడి నుంచి గిరిజనుడికి మాత్రమే బదిలీ కావాలని, గిరిజనేతరులకు ఏ ఒక్క అంగుళం భూమి కూడా వెళ్లకూడదని ఈ చట్టం అత్యంత స్పష్టంగా నిర్దేశిస్తోంది .అలాంటి పవిత్రమైన, చారిత్రాత్మకమైన చట్టం వల్ల "గిరిజనుడికి మేలు జరగడం లేదు, ఆర్థికంగా వెనుకబడిపోతున్నాడు" అని కుట్రదారుడు మంథనపు రామారావు ప్రచారం చేయడం పచ్చి అబద్ధం. గిరిజనులకు భూమి అనేది కేవలం మార్కెట్లో అమ్మే వ్యాపార సరుకు కాదు; అది వారి జీవనాధారం, సంస్కృతి, ఉనికి మరియు ఆత్మగౌరవం. మైదాన ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ మాఫియా, అగ్రకుల శక్తులు ఏజెన్సీ భూములను తక్కువ ధరకు కొల్లగొట్టి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి వేసిన పక్కా పథకమే ఈ దుష్ప్రచారం. చట్టాన్ని సడలిస్తే గిరిజనుడు తన భూమికి అధిక ధర పొందుతాడని చెప్పడం ఆదివాసీలను తీవ్రంగా మోసం చేయడమే అవుతుంది. చట్టంలో చిన్న సడలింపు ఇచ్చినా, అగ్రకుల ధనవంత వ్యాపారులు గిరిజనుల వద్ద ఉన్న కొద్దిపాటి భూములను చౌకగా కొనుగోలు చేసి, వారిని మళ్లీ సొంత నేలపైనే భూరహిత కూలీలుగా, బానిసలుగా మారుస్తారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భూముల విలువ పెరగకపోవడానికి లేదా గిరిజనులు ఆర్థికంగా ఎదగకపోవడానికి 1/70 చట్టం ఎంతమాత్రం కారణం కాదు. దశాబ్దాలుగా గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించడంలో, వ్యవసాయానికి కావాల్సిన నీటిపారుదల వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో మరియు పంటలకు సరైన మద్దతు ధర ఇవ్వడంలో పాలకుల అగ్రకుల పక్షపాత వైఖరి, నిర్లక్ష్యమే అసలు కారణం. గిరిజన ప్రాంతాల్లోని విలువైన ఖనిజ సంపదను, అటవీ భూములను బహుళ జాతి కంపెనీలకు, అగ్రకుల పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు ఈ 1/70 చట్టం పెద్ద అడ్డంకిగా మారింది. అందుకే, రామారావు వంటి కుట్రదారులను ముందు పెట్టి, ఈ చట్టం వల్ల గిరిజనులకు నష్టం జరుగుతోందనే ఒక అసత్య ప్రచారాన్ని మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ?వ్యవస్థలోని లోపాలను, రెవెన్యూ అధికారుల లంచగొండితనాన్ని ఆసరాగా చేసుకుని ఇప్పటికే వేలాది ఎకరాల గిరిజన భూములు అక్రమంగా, బినామీ పేర్లతో గిరిజనేతరుల ఆధీనంలోకి వెళ్లాయి. ఇది చట్టం యొక్క వైఫల్యం ఎంతమాత్రం కాదు, చట్టాన్ని చట్టబద్ధంగా, నిష్పాక్షికంగా అమలు చేయడంలో అధికారులు మరియు పాలకుల దుర్మార్గమైన వైఫల్యం. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా నోరు మెదపనివారు, ఇప్పుడు ఏకంగా చట్టాన్నే సమీక్షించాలని అనడం గిరిజనుల మనుగడపై నేరుగా దాడి చేయడమే.ప్రభుత్వం నిజంగా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలనుకుంటే మంథనపు రామారావు వంటి గిరిజన వ్యతిరేకులు, కుట్రదారుల మాటలను అసలు పరిగణనలోకి తీసుకోకూడదు. 1/70 చట్టాన్ని సడలించడం లేదా సమీక్షించడం కాకుండా, దానిని మరింత పటిష్ఠంగా, కఠినంగా అమలు చేయాలి. గిరిజనేతరుల చేతుల్లో ఉన్న బినామీ భూములను వెంటనే రీ-సర్వే చేసి, స్వాధీనం చేసుకుని అర్హులైన పేద గిరిజనులకు పంచాలి. గిరిజన రైతులు తమ భూములను అమ్ముకోకుండానే, వాటి ఆధారంగా బ్యాంకు రుణాలు, సబ్సిడీలు పొందేలా ప్రత్యేక గిరిజన ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం రూపుదిద్దాలి .ఆదివాసీ సమాజం తమ రాజ్యాంగబద్ధ హక్కుల పట్ల, భూరక్షణ చట్టాల పట్ల ఇప్పుడు మేల్కొనాల్సిన సమయం వచ్చింది. "మా అడవి – మా భూమి – మా హక్కు" అనే అమరుల పోరాట స్ఫూర్తిని ప్రతి గిరిజన గూడెంలో నిలబెట్టుకోవాలి. 1/70 చట్టాన్ని నీరుగార్చడానికి, గిరిజనులను భూరహితులను చేయడానికి అగ్రకులాల పెత్తందారీ శక్తులు చేస్తున్న ప్రతి కుట్రను, ప్రచారాన్ని ఐక్యంగా తిప్పికొట్టాలి. రాజ్యాంగం ఇచ్చిన రక్షణ కవచాన్ని కాపాడుకోవడం ఆదివాసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రజాస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని ఆకాంక్షించే ప్రతి ఒక్కరి ప్రాథమిక కర్తవ్యం. 1/70 చట్టం జోలికి వస్తే ఏజెన్సీ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో పోరాటాలు తప్పవని ప్రభుత్వాన్ని, పెత్తందారీ శక్తులను హెచ్చరిస్తున్నాం!



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి:



నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ముసాయిదా జాబితాలను తనిఖీ చేసి, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వేలో సేకరించిన పక్కా ఆధారాలతోనే ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రక్రియ నిబంధనల ప్రకారం సాగుతోందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీవో దేవీదాస్, తహశీల్దార్ రాజు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ కలెక్టరేట్ ప్రాంగణం సమీపంలో ఉన్న ఈవీఎం భద్రతా గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం భద్రతా రిజిస్టర్లను, సీసీ కెమెరాల నిరంతర పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అగ్నిమాపక రక్షణ పరికరాల పనితీరును తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవీఎం గోదాం వద్ద పోలీసులు నిరంతరం సీసీ కెమెరాల నిఘాతో కట్టుదిట్టమైన భద్రతను కొనసాగించాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహశీల్దార్ రాజుతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గంద్రత్ రమేష్, సిరికొండ రమేష్, మజార్, ముజాహిద్ శ్రావణ్, అజార్ మరియు ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ నీరు విడుదల చేయాలి: కూచాడి శ్రీహరిరావు



నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ నియోజకవర్గ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్సారెస్పీ సరస్వతి కాలువ ద్వారా సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు కోరారు. రైతుల ఇబ్బందులను ఆయన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నీటి విడుదలకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులను ఆదేశించి సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యపై తక్షణమే స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు శ్రీహరిరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణచాంద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంద్ర నరేష్ రెడ్డి, మామడ మాజీ జెడ్పీటీసీ రఫీ, మాజీ సర్పంచ్ బాపయ్య పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు



నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా తెలంగాణ జీవద్భాషలో రచనలు చేసి ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. భావితరాలకు కాళోజీ ఆశయాలను తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రాథోడ్ రమేష్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, ఉద్యానవన అధికారి రమణ, ఎల్డీఎం రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

## భైంసా గ్రీవెన్స్ డేలో ప్రజా సమస్యలపై ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేక దృష్టి




భైంసా/నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భైంసా సబ్ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ బుధవారం భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి ఆమె స్వయంగా అర్జీలను స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడి, బాధితులకు చట్టప్రకారం తక్షణ న్యాయం చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డేకు వచ్చిన పలు కుటుంబ వివాదాలపై భైంసా షీ టీం సిబ్బంది ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ కుదిర్చారు. గతంలో వచ్చిన పెండింగ్ ఫిర్యాదుల స్థితిగతులపై అధికారులతో సమీక్షించి, వాటిని త్వరితగతిన కొలిక్కి తేవాలన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER